# మనం
## హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్
ఆదివారం | 21 | జూన్ | 2026 పేజీలు: 7






# మొహం చాటేసిన రుతుపవనాలు

2

- ఇంకా దంచి కొడుతున్న ఎండలు
- ఇండ్ల నుండి బయటకు రావడానికి జంకుతున్న జనాలు
- ఈ సంవత్సరం వర్షాలు తక్కువే అంటున్న వ్యవసాయ శాఖ అధికారులు





# వర్షాకాలానికి ఎంఎంసీ పకడ్బందీ సన్నద్ధత

7

నాలాల డీసిల్టింగ్, నీరు నిల్వ కాకుండా చర్యలు: కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి..

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

### వేలాదిమంది పాల్గొనగా యోగాసనాలతో మార్మోగిన పరేడ్ గ్రౌండ్స్..







అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో నిర్వహించిన యోగా మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'వన్ డే కౌంట్డౌన్ ఈవెంట్'కు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తదితరులు హాజరయ్యారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి యువత, విద్యార్థులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు.

7



# రైతుల కొంప ముంచుతున్న క్రషర్ ఏర్పాటు

- వ్యవసాయ భూములకు ఎఫెక్ట్
- రైతుల భూములను లాక్కొని క్రషర్ ఏర్పాటుకు కేటాయింపు
- క్రషర్ ఏర్పాటును అడ్డుకుంటామంటున్న గ్రామస్తులు
- కలెక్టర్, ఎంపీ లకు ఫిర్యాదులు
- క్రషర్ ఏర్పాటు రద్దు చేయాలని డిమాండ్లు

2



# మొహం చాటేసిన రుతుపవనాలు

## ఇంకా దంచి కొడుతున్న ఎండలు

## ఇండ్ల నుండి బయటకు రావడానికి జంకుతున్న జనాలు

## ఈ సంవత్సరం వర్షాలు తక్కువే అంటున్న వ్యవసాయ శాఖ అధికారులు





మేడ్చల్, జూన్ 20 ( మనం జిల్లా ప్రతినిధి): నైరుతి రుతుపవనాలు మందగమనంతో తెలంగాణలో వరుణుడు మొహం చాటేసాడు. తొలినాళ్లలో వర్షాలు కురవడంతో అన్నదాతల ఆశ లు చిగురించగా తాజా పరిస్థితిలో నిరాశతో కురుకా పోయారు. నైరుతి రుతుపవనాలు పురోగతి మందగించడంతో తెలంగాణలో వర్షపాతం లో భారీ లోటు నమోదు అవుతుంది. తెలంగాణలో పలు ప్రాంతాల్లో వర్షాలు మొహం చాట్ వేయడంతో అన్నదాతలు వ్యవసాయ రంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జూన్ మొదటి వారంలో కురవాల్సిన వర్షాలు మూడో వారంలోకి అడుగుపెడుతున్న ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈపాటికి రైతుల దుక్కులు దున్ని వరి నాట్లు వేయాల్సి ఉండగా వరునుడు మొహం చాటేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

### ఎల్ నివో ప్రభావం రుతుపవనాలపై ప్రతికూలత

సముద్రం ఉపత్తల ఉష్ణోగ్రతలలో వచ్చే మార్పుల కారణంగా ఏర్పడే ఎలినివా ప్రభావం రుతుపవనాలపై తీవ్ర ప్రతికూలతలు చూపిస్తుంది. గాలి దిశ మారడం భూ ఉపరితలం వేడెక్కడం వంటి పరిస్థితులతో ఏర్పడిన అడ్డంకులు రుతుపవనాల వేగాన్ని కుంటుపరిచాయి. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 శాతం లోటు నమోదయింది. కొన్ని జిల్లాల్లో 50 నుండి 70 శాతం వరకు వర్షాలు పడకపోవడంతో రైతులు పంటలు వేయడానికి ఎదురుచూడల్సిన పరిస్థితి నెలకొంది. వాస్తవానికి జూన్ మొదటి వారంలోనే వర్షాలు కురవాల్సి ఉండే. కానీ జూన్ చివరి వారానికి వస్తున్న వర్షాలు మొహం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రుతుపవనాలు ఆలస్యం కావడం వల్ల వరి పత్తి తదితర కర్రీస్ పంటలు విత్తన వేల తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తి కి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ శాఖ తాజా నివేదికల ప్రకారం రాబోయే రోజుల్లో రుతుపవనాలు పుంజుకొని వర్షాలు కురుస్తాయని పేర్కొంటున్నారు.

### సుర్రుమనిపిస్తున్న ఎండలు

ఒకపక్క రుతుపవనాలు మందగించడం జూన్ చివరివారం లో అడుగుపెడుతున్న వర్షాలు మాత్రం కానరావడం లేదు. పొద్దంతా ఎండ వేడిమితో అల్లాడుతుంటే సాయంత్రం కాస్తంత వాతావరణం మార్పు చెంది చల్లదనం కనిపిస్తుంది. మార్చి ఏప్రిల్ మే లో ఎండలు ఎలా కాచాయో ఇప్పుడు సైతం ఎండలు సుర్రుమంటూ మండుతున్నాయి. ఉదయం 7 గంటల కే ఎండ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. దీంతో జనాలు ఇంటి గడప దాటాలంటే భయపడుతున్నారు..

### అడుగంటిపోతున్న భూగర్భ జలాలు.

ఒకపక్క వర్షాలు కురవకపోవడం మరోపక్క నీటి అవసరాలు ఎక్కువ ఉండడం వల్ల జనాలు ఇంకా టాంకర్లపై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంకా పట్టణాలలో ట్యాంకర్ల మీదనే జనాలు ఆధారపడి ఉన్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. విచ్చలవిడిగా భూగర్భ జలాలను తోడడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయన నిపుణులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో మంచినీటి కటకటకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

# రైతుల కొంప ముంచుతున్న క్రషర్ ఏర్పాటు

## వ్యవసాయ భూములకు ఎఫెక్ట్

## రైతుల భూములను లాక్కొని క్రషర్ ఏర్పాటుకు కేటాయింపు

## క్రషర్ ఏర్పాటును అడ్డుకుంటామంటున్న గ్రామస్తులు

## కలెక్టర్, ఎంపీ లకు ఫిర్యాదులు

## క్రషర్ ఏర్పాటు రద్దు చేయాలని డిమాండ్లు






మేడ్చల్, జూన్ 20 ( మనం జిల్లా ప్రతినిధి): రైతుల అబిష్టానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్న క్రషర్... రైతుల కొంపముంచనుంది. రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కొని క్రషర్ ఏర్పాటుకు కేటాయించడంపై సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని రావల్ కోల్ గ్రామంలోని 111 సర్వే నెంబర్ లో 25 ఎకరాల అస్సైన్డ్ భూమిలో క్రషర్ ఏర్పాటుకు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాత ముత్తాతల కింద ఈ స్థలాన్ని వ్యవసాయం చేసుకునేందుకు కేటాయించారని, ఆ స్థలంలో గత కొన్ని ఏళ్ల నుండి వ్యవసాయం చేసుకొని బ్రతుకుతున్నామని, అలాంటి స్థలాన్ని లాక్కొని క్రషర్ ఏర్పాటు కు కేటాయించడం అన్యాయమని ఆరోపిస్తున్నారు. మాకు కేటాయించిన వ్యవసాయ భూములను లాక్కోవడమే కాకుండా క్రషర్ ఏర్పాటు వల్ల సమీపంలోని పంట పొలాలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### రైతులు వ్యతిరేకించిన వినని అధికారులు

రావల్ కోల్ గ్రామంలోని 111 సర్వే నెంబర్ లో 25 ఎకరాల స్థలంలో క్రషర్ ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇచ్చారు. అనుమతి ఇచ్చేముందు రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టగా అందులో మెజార్టీ రైతులు క్రషర్ ఏర్పాటును నిరాకరించారు. క్రషర్ ఏర్పాటు వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి వ్యవసాయ భూములు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### బలవంతంగా లాక్కున్న భూములు

సర్వేనెంబర్111ల్ క్రషర్ ఏర్పాటు కోసం ఇచ్చిన 25 ఎకరాల అస్సైన్డ్ భూమిని గతంలో రైతులు సాగు కోసం ఇచ్చారు ఇప్పుడు ఆ భూమిని రైతుల నుండి లాక్కొని క్రషర్ ఏర్పాటుకు ఇవ్వడం రైతుల పొట్టను కొట్టడమేనని,, ఈ స్థలంలో దశాబ్ద కాలం నుండి వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నామని అలాంటి స్థలాన్ని లాక్కొని అందులో క్రషర్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం అన్యాయమని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల కొన్ని కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉందని ఆ గ్రామస్తులు పేర్కొంటున్నారు.



### క్రషర్ ఏర్పాటు వల్ల ఆరోగ్య సమస్యలు

సర్వేనెంబర్111 లో ఏర్పాటు చేస్తున్న ప్రజల వల్ల స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురి అయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. క్రషర్ వల్ల శ్వాస కోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వెంటనే దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### క్రషర్ ఏర్పాటు అనుమతులను రద్దు చేయాలి

క్రషర్ ఏర్పాటు అనుమతులను రద్దు చేయాలని రావల్ కోల్ గ్రామస్తులు జిల్లా కలెక్టర్ మను చౌదరి తో పాటు మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ కు మేడ్చల్ తహసిల్దార్ భూపాల్ కు వినతి పత్రాలను అందజేశారు. క్రషర్ ఏర్పాటును నిలుపుదల చేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. రైతుల భూములను లాక్కొని అందులో క్రషర్ ఏర్పాటు చేయడమేంటి అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

# మొద్దు నిద్రలో టౌన్ ప్లానింగ్ అధికారులు

**గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో జోరుగా అక్రమ నిర్మాణాలు**
**కండ్లు అప్పగించి చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు**
**అక్రమ నిర్మాణాలను అడ్డుకునే ప్రయత్నం కూడా చేయని అధికారులు**



మేడ్చల్, జూన్ 20 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధి గుండ్ల పోచంపల్లి డివిజన్ లో టౌన్ ప్లానింగ్ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. ఇక్కడ జోరుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్న చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం వాటిని అడ్డుకునే ప్రయత్నాలు కూడా చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం అక్రమ నిర్మాణదారులకు వరంగా మారింది. ఎలాంటి అనుమతులు లేకున్నా నిర్మాణాలు చేసుకున్న... ఇక్కడ టౌన్ ప్లానింగ్ అధికారులు కండ్లు అప్పగించి చూస్తారే తప్ప అడ్డుకున్న ప్రయత్నాలు చెయ్యరు. దీంతో పుట్టగొడుగుల్లా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి.

**డివిజన్ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే...**

డివిజన్ కార్యాలయానికి పూతవేటు దూరంలోనే అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమ షెడ్ల నిర్మాణాలు సాగుతున్న సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు కండ్లు అప్పగించి చూస్తున్నారు తప్ప వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ కట్టడాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడంలో ఎందుకు జరుగుతున్నారో అర్థం కాని పరిస్థితిలో ప్రజలు ఉన్నారు. ఇలా అక్రమ నిర్మాణాలు చేపట్టుకుంటూ పోతూ ప్రభుత్వానికి గండి కొడుతుందా సదరు టౌన్ ప్లానింగ్ అధికారులు కండ్లు అప్పగించి చూస్తున్నారే తప్ప అక్రమ కట్టడాలను అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఎవరికి తోచిన విధంగా వారు అక్రమ కట్టడాలు చేపడుతూ వెళ్తున్నారు.

**పూర్తిస్థాయి టిపిఓ లేకపోవడమే ఇందుకు కారుణమా...**

మేడ్చల్ సర్కిల్ కు పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడం వల్ల అక్రమ కట్టడాలకు స్వేచ్ఛ దొరికినట్లు అయింది పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడం వల్ల ఈ బాధ్యతలను బిల్ కలెక్టర్లు నిర్వహిస్తున్నారు. వీరు సైతం ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు కావడం... వారు నిర్లక్ష్యం ఉండడం వల్ల అక్రమ కట్టడాలకు మరింత బీజం పోస్ట్ నట్లు అవుతుంది. మాకెందుకులే ఈ పంచాయతీ అంటూ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల జోరుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



---

# బయటపడ్డ గ్రిప్ స్ట్రాప్పింగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లీలలు

**నక్ష రోడ్డు కబ్జాపై రెవెన్యూ అధికారుల విచారణ**
**మనం కథనానికి స్పందన**
**హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు**






మనం ఎఫెక్ట్

మేడ్చల్, జూన్ 20 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధి నూతనకల్ గ్రామం లో ఉన్న గ్రిప్ స్ట్రాప్పింగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ బాగోతం బయటపడింది. నక్ష స్థలాన్ని కబ్జా చేయడంపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు.డబిల్వూర్, నూతనకల్ గ్రామాల సరిహద్దులను తెలిపే అధికారిక హద్దురాయిని తొలగించి కాంపౌండ్ వాల్ నిర్మించుకున్నారని మనం దినపత్రిక ప్రచురించిన కథనంపై మేడ్చల్ రెవెన్యూ అధికారులు స్పందించారు ఇది ప్రభుత్వ స్థలం,కాంపౌండ్ ఎలా నిర్మిస్తున్నారు అంటూ స్థానికులు ప్రశ్నిస్తే ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ సమాధానం ఇస్తూ నక్షస్థలాన్ని తమ కాంపౌండ్ వాల్ లోకి గ్రిప్ స్ట్రాప్పింగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చేర్చుకొని కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని చేపట్టారని స్థానికుల ఫిర్యాదు మేరకు మనం దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. దీంతో రెవెన్యూ అధికారులు విచారణ జరిపి నక్షస్థలాన్ని తమ కాంపౌండ్ లోకి జరుపుకొని కాంపౌండ్ వాల్ నిర్మించుకున్నారని నిర్ధారించామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. నక్షస్థలం చుట్టు కాంపౌండ్ వాల్ నిర్మించడం సరి కాదని నక్ష స్థలాన్ని వదిలేసి కాంపౌండ్ వాళ్లు నిర్మించుకోవాలని కంపెనీ యాజమాన్యానికి సూచించారు. దీంతో ఇంతకాలం నక్షస్థలం గ్రిప్ స్ట్రాప్పింగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధీనంలో ఉండి ఇప్పుడు రెవిన్యూ అధికారుల విచారణలో బయటపడడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయల విలువ గల ఈ స్థలానికి విముక్తి వచ్చినట్లయితే గ్రామస్తులు భావిస్తున్నారు

---



# పప్పుధాన్యాల సాగుతో రైతులకు మేలు

**- ఎమ్మెల్యే కాలే యాదయ్య**

చేవెళ్ల, జూన్ 20(మనం న్యూస్) :రైతులు పప్పుధాన్యాల సాగుపై దృష్టి సారించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ కింద చేవెళ్ల మండల రైతులకు కందుల విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పప్పుధాన్యాల ఉత్పత్తి పెంపుతో రైతుల ఆదాయం పెరగడంతో పాటు దేశం దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమత వెంకట్రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్రెడ్డి, ముడిమియాలు పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ తరఫున సహాయ వ్యవసాయ సంచాలకులు సురేష్బాబు, మండల వ్యవసాయ అధికారి శంకర్లాల్, వ్యవసాయ విస్తరణాధికారులు బాలకోటేశ్వరరావు, కిరణ్మయి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**ఎమ్మెల్యే గణేష్**



సికింద్రాబాద్, జూన్ 20 (మనం న్యూస్) రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగ నియామకాల వేగవంతం, అలాగే కళాశాల అధ్యాపకులు ఎదుర్కొంటున్న పలు అంశాలపై కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ను ఉస్మానియా విశ్వవిద్యాలయ పీహెచ్డీ స్కాలర్ నిశాంత్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నిశాంత్ మాట్లాడుతూ, ఉన్నత విద్య పూర్తి చేసిన యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు వేగవంతం చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అధ్యాపకుల సంక్షేమం, విద్యా రంగ అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్ సమస్యలను శ్రద్ధగా విన్నారు. సంబంధిత అంశాలను ప్రభుత్వ, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైన పరిష్కార చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నిరుద్యోగ యువత సంక్షేమం, ఉద్యోగ అవకాశాల పెంపు, విద్యా రంగ అభివృద్ధి, అధ్యాపకుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు.



## చిలకలగూడ పోలీసులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం

**శారీరక, మానసిక ఆరోగ్యంపై నిపుణుల సూచనలు...**

సికింద్రాబాద్, జూన్ 20 (మనం న్యూస్) వారాసిగూడలోని చిలకలగూడ ఏసీపీ డివిజన్ కార్యాలయంలో శనివారం పోలీసు అధికారులు, సిబ్బందికి ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని హైదరాబాద్ సిపి సజ్జనార్, సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షిత కె మూర్తి ఐపిఎస్ ఆదేశాల మేరకు నిర్వహించారు. చిలకలగూడ డివిజన్కు చెందిన సుమారు 70 మంది అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ ఆసుపత్రికి చెందిన డాక్టర్ జే. తిరుపతి రావు, వెల్నెస్ సెంటర్కు చెందిన పురుషోత్తం ముఖ్య అతిథులుగా హాజరై ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు కీలక సూచనలు అందించారు. సమతుల్య ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, తగినంత నిద్ర, యోగా, ధ్యానం, మానసిక ఒత్తిడి నియంత్రణ వంటి అంశాల ప్రాముఖ్యతను వివరించారు. పోలీసు విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామం, యోగా, ధ్యానానికి కేటాయిస్తే అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని సూచించారు. ఆరోగ్యవంతమైన పోలీసు సిబ్బందే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలరని నిపుణులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది నిపుణులు అందించిన సూచనలను ఆసక్తిగా విని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమం ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి దోహదపడిందని చిలకలగూడ ఏసీపీ కె. శశాంక్ రెడ్డి తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడ్చల్, జూన్ 20 ( మనం జిల్లా ప్రతినిధి): గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలకు నేడువిద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గుండ్ల పోచంపల్లి విద్యుత్ శాఖ ఏఈ కె విజయకుమార్ తెలిపారు. 11 కెవి అపర్ణ ఫీడర్, 11 కెవి బెల్ల విస్త ఫీడర్ 11 కెవి అప్లలాక్ ఫీడర్ కింద చెట్లు నరకడంతో పాటు మరమ్మత్తుల పనులు ఉన్నందున ఈ ఫీడర్ కింద ఉన్న ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. అపర్ణ ఫీడర్ కింద ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు బెల్లె విస్త ఫీడర్ కింద ఉదయం 9:00 నుండి సాయంత్రం 5 గంటల వరకు అప్లలాక్ ఫీడర్ కింద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏ ఈ తెలిపారు. దీనివల్ల అపర్ణ కానోపీ, తులిప్, జాస్మిన్, అప్పరెల్ పార్క్ ఇండస్ట్రీస్ కు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని తెలిపారు.



# ఆయుర్వేదిక్ పార్క్ అభివృద్ధికి రూ.29 లక్షల ప్రతిపాదనలు

**15 రోజుల్లో సమస్యల పరిష్కారం: తలసాని..**





సికింద్రాబాద్, జూన్ 20 (మనం న్యూస్) ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా, అనాలోచిత నిర్ణయాలతో జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించిందని మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. శనివారం సనత్నగర్లోని కోవెల్ స్కూల్ సమీపంలోని ఆయుర్వేదిక్ పార్కును వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పార్కులోని పాత్వే దెబ్బతిన్న పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే, వాకర్ల సౌకర్యార్థం మొరం వేసి పునర్నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలించి ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్కులో టాయిలెట్లు, లైటింగ్ సదుపాయాలు కల్పించాలని కోరుతూ వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పార్క్ అభివృద్ధి పనుల కోసం రూ.29 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలియజేయగా, వాటి మంజూరు కోసం జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడిన తలసాని వెంటనే ఆమోదం ఇవ్వాలని కోరారు. పార్కులో ఉన్న అన్ని సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి కొరత సమస్య లేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాలకు రావాల్సిన నీటిని ఇతర ప్రాంతాలకు మళ్లించడం వల్లే కొరత ఏర్పడుతోందని ఆరోపించారు. నీటి సమస్య పరిష్కారానికి వాటర్వర్క్స్ ఎండీతో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, కమర్షియల్ అవసరాల కోసం ట్యాంకర్ నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి మౌలిక వసతులు, సిబ్బంది నియామకాలు చేపట్టకుండా మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తలసాని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సమస్యలపై అవగాహన లేదని, అసమర్థ పాలన కారణంగా రెండున్నర సంవత్సరాలకే అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి నెలకొందని అన్నారు.

# శ్రీరాంనగర్లో రూ.17.70 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజ్ పనుల ప్రారంభం

**కాలనీ వాసుల సమస్యలకు పరిష్కారం దిశగా కీలక అడుగు**

**అభివృద్ధి పనుల ప్రారంభంతో హర్షం వ్యక్తం చేసిన స్థానికులు**



నాగారం, జూన్ 20 (మనం న్యూస్) : నాగారం డివిజన్ పరిధిలోని శ్రీరాం నగర్ కాలనీలో రోడ్డు నంబర్-13లో రూ.17 లక్షల 70 వేల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు డ్రైనేజ్ నిర్మాణ పనులను శనివారం ఘనంగా ప్రారంభించారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు చేపట్టిన ఈ అభివృద్ధి పనులకు స్థానిక ప్రజలు స్వాగతం పలుకుతూ ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు వెంకట్ రెడ్డి, హరి బాబు, సుమిత్ర సురేష్, కందాడి శ్రీనివాస్ రెడ్డి, భద్రు నాయక్, కాలనీ అధ్యక్షుడు రాఘవేంద్ర రావు, ఆశిష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సీసీ రోడ్డు, డ్రైనేజ్ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# బీజేపీ రాష్ట్ర కమిటీ జాయింట్ కన్వీనర్గా ఫణి భూషణ్ చింతపల్లి

**తెలంగాణ బీజేపీ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర కమిటీ జాయింట్ కన్వీనర్గా ఫణి భూషణ్ చింతపల్లి నియామకం.**

**దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధి, హిందూ ధార్మిక విలువల పరిరక్షణకు కృషి చేస్తానని ఫణి భూషణ్ హామీ.**



కాప్రా, జూన్ 20 (మనం న్యూస్): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తెలంగాణ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర కమిటీ జాయింట్ కన్వీనర్గా ఫణి భూషణ్ చింతపల్లిని పార్టీ రాష్ట్ర నాయకత్వం నియమించింది. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఫణి భూషణ్ చింతపల్లి మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎండోమెంట్ సెల్ను మరింత బలోపేతం చేస్తూ దేవాలయాల అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో చురుకుగా పనిచేస్తానన్నారు. అలాగే పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు హిందూ ధార్మిక సంప్రదాయాల పరిరక్షణకు తన వంతు కృషి కొనసాగిస్తానని తెలిపారు.

# రోడ్లు, డ్రైనేజీ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**డిప్యూటీ కమిషనర్కు వినతిపత్రం అందజేసిన కాలనీ వాసులు, కాంగ్రెస్ నాయకులు..**



నాగారం, జూన్ 20 (మనం న్యూస్): నాగారం డివిజన్ పరిధిలోని శ్రీరామనగర్ కాలనీ, చండీశ్వర నగర్ కాలనీలలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులు గట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు తమ ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతినడం, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజల సమస్యలను అత్యవసరంగా పరిగణించి అభివృద్ధి పనులు చేపట్టి, రోడ్లు మరియు డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పంగహరి బాబు, రాంపల్లి మాజీ ఉపసర్పంచ్ పరిగే మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కిరణ్ జ్యోతి ప్రవీణ్ కుమార్, మాజీ వార్డు సభ్యుడు చిరశేఖర్, చండీశ్వర నగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఆశిష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బండి భగీరథకు బెయిల్



మేడ్చల్, జూన్ 20 ( మనం జిల్లా ప్రతినిధి): వివాదాస్పద ఫోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ కు బెయిల్ లభించింది. గత రెండు వారాలుగా చర్చలు కూడా జైలు లో ఉన్న భగీరథ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ పై మల్కాజ్గిరి కోర్టు విచారణ చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



# నారసింహా.. సిపిఎస్ రద్దు చేయ..రా.!

**ఏఐఎన్‌పిఎస్ఈ ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాచన రఘునందన్**

హైదరాబాద్ 20 (మనం న్యూస్) భాగస్వామ్య పింఛను పథకం (సి పి ఎస్)రద్దు అనే విషయం దైవాధీనం అయ్యిందని,అందుకే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు, ఆల్ ఇండియా న్యూ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏ ఐ ఎన్ పి ఎస్ ఈ ఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి మాచన రఘునందన్ అన్నారు. గురువారం నాడు ఆయన భాగస్వామ్య పింఛను పథకం(సి పి ఎస్)రద్దు కావాలన్న తమ అభిమతం నెరవేరాలని కోరుతూ.. తూప్రాన్ సమీపంలోని నాచవరం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ..పాలకులు ఎప్పటికప్పుడు సి పి ఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారే తప్ప..పెన్షన్ తో ఉద్యోగుల ఆర్థిక భద్రత అన్న విషయం వారికి పట్టడం లేదని రఘునందన్ అవేదన వ్యక్తం చేశారు.దేశ వ్యాప్తంగా కోటి మంది కి పైగా ఉద్యోగులు న్యూ పెన్షన్ స్కీమ్ వద్దు అని దైవాన్ని దీనంగా అర్థిస్తున్నామని రఘునందన్ వివరించారు. పాలకులకు సి పి ఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ పథకం ను పునరుద్ధరించేలా బుద్ధి ప్రసాదించాలని కోరుతూ..దేవుళ్ళకు, దేవతలకు పూజలు చేస్తున్నామని రఘునందన్ వెల్లడించారు.

# భూదాన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలి

**కబ్జాకోరులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి**

**తెలంగాణలోని భూదాన భూములు అక్రమ కబ్జాలకు గురవుతున్నాయని సర్వోదయ మండల్ ఆందోళన.**

**హైకోర్టు తీర్పు అమలు చేసి భూదాన భూములను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్**

జవహర్నగర్, జూన్ 20 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో భూదాన భూములు యథేచ్ఛగా కబ్జాలకు, అక్రమాలకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలంగాణ రాష్ట్ర సర్వోదయ మండల్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. శంకర్ నాయక్ విమర్శించారు. మేడ్చల్ జిల్లా సర్వోదయ మండల్ మహాసభలు శనివారం జవహర్నగర్ పరిధిలోని బాలాజీనగర్ దళిత భవన్లో దయానంద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్. శంకర్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. గిరిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.79 లక్షల ఎకరాల భూదాన భూములు ఉన్నప్పటికీ వాటి రక్షణలో ప్రభుత్వం విఫలమైందన్నారు. భూదాన భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కబ్జాకోరులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నాంపల్లి గాంధీభవన్లో భూదాన్ బోర్డు పేరుతో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని, హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ భూదాన్ యజ్ఞ బోర్డును ఖాళీ చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రొసీడింగ్స్ ద్వారా పేదలను మోసం చేస్తున్న వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్, ఐఎఫ్టీయూ జాతీయ నాయకులు షేక్ షావలి, సర్వోదయ మండల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, మల్లేష్, సుజాత, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# బీసీ హాస్టల్లో సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం

**- వార్డెన్ను సస్పెండ్ చేయాలని డిమాండ్**

చేవెళ్ల, జూన్ 20(మనం న్యూస్): చేవెళ్ల బీసీ కళాశాల హాస్టల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. శనివారం హాస్టల్ను సందర్శించిన ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. హాస్టల్లో విద్యార్థులకు సమయానికి అల్పాహారం అందడం లేదని ఆరోపించారు. ఉదయం 10 గంటలు దాటినా టిఫిన్ అందించకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జూన్ నెలలో అడ్మిషన్లు





ప్రారంభమైనప్పటికీ హాస్టల్లో సరైన వసతులు లేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు.

హాస్టల్ భవనంలో లీకేజీలను వెంటనే మరమ్మతు చేయాలని, డ్రైనేజీ సౌకర్యాలు మెరుగుపరచాలని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ.800 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడాలని

# ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి

**తిరుమలగిరిలో బీఆర్ఎస్ ధర్నా.. 157/1 సర్వే నంబర్ భూమి వివాదంపై ఆందోళన..**

సికింద్రాబాద్, జూన్ 20 (మనం న్యూస్) తిరుమలగిరిలోని 157/1 సర్వే నంబర్లో ఉన్న ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి రక్షించాలని డిమాండ్ చేస్తూ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శనివారం తిరుమలగిరి ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ భూమి విలువ సుమారు రూ.800 కోట్ల వరకు ఉంటుందని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. ప్లకార్డులతో బైఠాయించి ధర్నా చేపట్టిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తీవ్ర విమర్శలు గుప్పించారు.

**ఎమ్మార్వో కార్యాలయంలో ఉద్రిక్తత.. వినతిపత్రం స్వీకరించిన డిప్యూటీ తహసిల్దార్**

నిరసనలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు ఎమ్మార్వో కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు తమ బాధ్యతను విస్మరించి ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని నాయకులు ఆరోపించారు. 2023 ఆగస్టు 19న ఈ భూమి కబ్జాలకు సంబంధించి అప్పటి ప్రభుత్వం కేసులు నమోదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మార్వో అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ తహసిల్దార్కు వినతిపత్రం అందజేసి, ప్రభుత్వ తరపున కోర్టులో కౌంటర్ దాఖలు చేసి భూమిని రక్షించాలని డిమాండ్ చేశారు.








**పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి.. లేకపోతే ఉద్యమాలు తీవ్రతరం**

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, రూ.800 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని భూ మాఫియాల చెరలోకి వెళ్లనివ్వడం దురదృష్టకరమని అన్నారు. ఈ స్థలంలో షాపింగ్ మాల్స్ నిర్మాణానికి మార్గం సుగమం చేస్తున్నారంటూ ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కంటోన్మెంట్ నియోజకవర్గంలో అనేక డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇంటికి కూడా పునాది వేయలేదని విమర్శించారు. 157/1 భూమిపై ప్రభుత్వ యాజమాన్యాన్ని స్పష్టం చేసే బోర్డులు ఏర్పాటు చేయడం, ట్రెస్ పాస్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ చేయడం, భూమిని పేదలకు ఇండ్ల స్థలాలుగా కేటాయించడం వంటి చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే మండల కార్యాలయాల ముట్టడులు, ధర్నాలు, రాస్తారోకోలు, నిరాహార దీక్షలు సహా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ క్రిశాంక్, కంటోన్మెంట్ మాజీ అభ్యర్థి నివేదిత, బీఆర్ఎస్ నాయకులు గజ్జెల నాగేష్, మాజీ ప్రజాప్రతినిధులు, తెలంగాణ ఉద్యమకారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ భూములను కాపాడి పేదలకే అందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

# సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించిన పోలీసులు

**గుర్తు తెలియని కాల్స్, మెసేజ్లకు స్పందించొద్దు.. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి**



సికింద్రాబాద్, జూన్ 20 (మనం న్యూస్) సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆన్లైన్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు శనివారం వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకలగూడ ఏసీపీ కె. శశాంక్ రెడ్డి, వారాసిగూడ ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు పంపే సందేశాలు, వీడియో కాల్స్, లింకులు, ఆన్లైన్ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తులకు డబ్బులు పంపరాదని, వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు వంటి గోప్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. డబ్బులు పంపే ముందు అవతలి వ్యక్తి వివరాలను పూర్తిగా నిర్ధారించుకోవాలని తెలిపారు. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 'గోల్డెన్ అవర్' లో 1930 హెల్ప్లైన్కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత పోలీస్ స్టేషన్కు పంపడం ద్వారా బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. కోర్టు నిబంధనల మేరకు కోల్పోయిన నగదును తిరిగి పొందేందుకు కూడా అవకాశం ఉంటుందని వివరించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# సెయింట్ థెరిస్సా స్కూల్లో త్రివేణి వేడుకలు

**పర్యావరణం-యోగా-సంగీత దినోత్సవాల సంయుక్త నిర్వహణ.. విద్యార్థుల యోగాసనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు..**



ఏఎస్ రావు నగర్, జూన్ 20 (మనం న్యూస్): ఏఎస్ రావు నగర్ అరుల్ కాలనీలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్లో శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం, అంతర్జాతీయ యోగా దినోత్సవం, ప్రపంచ సంగీత దినోత్సవాలను ఒకే వేదికపై ఘనంగా నిర్వహించారు. 'వెలుగు నుండి జ్ఞానోదయం' అనే ప్రధాన అంశంతో నిర్వహించిన ఈ త్రివిధ ఉత్సవాలకు కుషాయిగూడ సబ్ ఇన్స్పెక్టర్ ఎన్. వెంకన్న ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకన్న మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థులు ముందుండాలని సూచించారు. అనంతరం భూమి, నీరు, చెట్ల సంరక్షణకు కట్టుబడి ఉంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సామూహిక యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ వివరించారు. ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పర్యావరణ చైతన్య గీతాలు, దేశభక్తి గీతాలు, శాస్త్రీయ మరియు లలిత సంగీత ప్రదర్శనలతో సభికులను అలరించారు. సంగీతం మనసుకు ఉల్లాసాన్ని అందిస్తుందని, ప్రకృతిలో ప్రతి ధ్వనిలోనూ సంగీతం దాగి ఉంటుందని తమ ప్రదర్శనల ద్వారా చాటిచెప్పారు.




ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా
# అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**వేలాదిమంది పాల్గొనగా యోగాసనాలతో మార్మోగిన పరేడ్ గ్రౌండ్స్..**

సికింద్రాబాద్, జూన్ 20 (మనం న్యూస్) అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో నిర్వహించిన యోగా మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'వన్ డే కౌంట్డౌన్ ఈవెంట్'కు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తదితరులు హాజరయ్యారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి యువత, విద్యార్థులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు.

**యోగా ప్రపంచానికి భారత్ అందించిన అపురూప కానుక**

ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు మాట్లాడుతూ యోగా ఏ మతానికీ పరిమితమైనది కాదని, అది సర్వమానవాళి శ్రేయస్సు కోసం భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక సమతుల్యతను అందించే సమగ్ర జీవన



విధానమే యోగా అని వివరించారు. మాజీ గవర్నర్



బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ యోగా కుల, మత భేదాలకు అతీతంగా అందరినీ ఏకం చేసే శక్తిగా నిలుస్తోందని, ప్రతి ఒక్కరూ దానిని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర మంత్రి కిషన్



రెడ్డి మాట్లాడుతూ భారత ప్రాచీన యోగా సంపదకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చిన నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని పేర్కొన్నారు. ఆయన చొరవతోనే ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందని గుర్తుచేశారు. యోగా కేవలం ఒకరోజు కార్యక్రమం కాదని, ఆరోగ్యకరమైన జీవనశైలికి మార్గదర్శకమని అన్నారు.

**ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగానే మార్గం**

తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ యోగా శరీరం, మనసు, ఆత్మ మధ్య సమన్వయాన్ని నెలకొల్పే మహోన్నత సాధనమని అన్నారు. భారతదేశ సంస్కృతి, వారసత్వం, విలువలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడంలో యోగా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక అని చెబుతూ ప్రతి ఒక్కరూ దీన్ని నిత్యజీవితంలో అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.





బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించడంలో యోగా దివ్యౌషధంలా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ యువత శారీరక, మానసిక దృఢత్వానికి యోగాసనాలు అత్యంత అవసరమని అన్నారు. కార్యక్రమం ముగింపులో యోగాను ప్రతి ఇంటికీ, ప్రతి వ్యక్తికీ చేరవేయాలని నాయకులు పిలుపునిచ్చారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన, సమతుల్యమైన, శక్తివంతమైన భారత నిర్మాణం సాధ్యమవుతుందని వారు ఆకాంక్షించారు.

---

# వర్షాకాలానికి ఎంఎంసీ పకడ్బందీ సన్నద్ధత

**నాలాల డీసిల్టింగ్, నీరు నిల్వ కాకుండా చర్యలు: కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి..**



సికింద్రాబాద్, జూన్ 20 (మనం న్యూస్) మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. శనివారం మౌలాలి ఫ్లైఓవర్, లాలాపేట్, ఈస్ట్ ఆనంద్బాగ్, వాణి నగర్, మారుతి నగర్ ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. లాలాపేట్లోని మౌలాలి ఫ్లైఓవర్ పరిసరాల్లో నీరు నిలిచే ప్రాంతాలు, ఓపెన్ నాలాలు, వరద నీటి కాలువలను పరిశీలించిన కమిషనర్, నాలాల్లో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే అడ్డంకులను తొలగించి, భారీ వర్షాల సమయంలో రహదారులపై నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈస్ట్ ఆనంద్బాగ్లో భౌగోళిక పరిస్థితులను పరిశీలించిన ఆయన, ఎత్తైన ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు సమీప నాలాల్లోకి సక్రమంగా మళ్లి నివాస ప్రాంతాల్లోకి చేరకుండా చూడాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి నీటి ప్రవాహం సాఫీగా కొనసాగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాణి నగర్, మారుతి నగర్ ప్రాంతాల్లో ఓపెన్ నాలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతున్నట్లు గుర్తించిన కమిషనర్, వెంటనే శుభ్రపరిచే పనులు చేపట్టాలని సూచించారు. రహదారుల పక్కన అక్రమంగా పారవేసిన నిర్మాణ వ్యర్థాలను తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి వరద ముప్పును నివారించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో డీసీ, డీఈ, ఏఈ, హైడ్రా, రామ్కీ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

---

# యోగం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యం

**డా. శ్రీరామ్ వెంకటేష్**

సికింద్రాబాద్, జూన్ 20 (మనం న్యూస్) సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన 24 గంటల కౌంట్డౌన్ యోగా కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని బీజేపీ నాయకుడు, సామాజిక సేవకుడు డా. శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ, యోగం భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన ఆధ్యాత్మిక, ఆరోగ్య సంపద అని పేర్కొన్నారు. యోగాభ్యాసం ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పొందవచ్చని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషి వల్ల యోగానికి అంతర్జాతీయ గుర్తింపు లభించి, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకుంటున్నారని అన్నారు. ఒక భూమి - ఒక ఆరోగ్యం అనే సందేశంతో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచ వేదికపై చాటిచెబుతోందని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ, ఆరోగ్యవంతమైన భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, బీజేపీ జాతీయ నాయకుడు కె. లక్ష్మణ్, తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు తదితర ప్రముఖులు పాల్గొని యోగం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఇంట్లో యోగా - ప్రతి వ్యక్తికి ఆరోగ్యం - ప్రతి కుటుంబానికి ఆనందం అనే లక్ష్యంతో అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

